క్లుప్తంగా

గర్భిణులకు సామూహిక సీమంతం

కాజీపేట: మహిళలు, బాలబాలికలు సంపూర్ణ ఆరోగ్యంగా ఉండాలనే లక్ష్యంతో ప్రభుత్వం అంగన్‌వాడీ కేంద్రాల ద్వారా అందిస్తున్న న్యూట్రిషన్ ఫుడ్‌ను సద్వినియోగం చేసుకోవాలని స్త్రీ, శిశు సంక్షేమ శాఖ సోమిడి సెక్టార్ సూపర్‌వైజర్ డి.కవిత అన్నారు. 62వ డివిజన్ రహమత్‌నగర్ కాలనీలో గర్భిణులు, బాలింతలకు అవగాహన సదస్సును నిర్వహించారు. అనంతరం గర్భిణులకు సామూహిక సీమంతం నిర్వహించారు. కార్యక్రమంలో అంగన్‌వాడీ టీచర్లు వి.శ్రీలత, డి.బాలశ్రీ, కె.అన్నపూర్ణ తదితరులు పాల్గొన్నారు.

యువజన విభాగం రాష్ట్ర ఉపాధ్యక్షుడిగా 'కల్లూరి'



హన్మకొండ: జాతీయ బీసీ సంక్షేమ సంఘం యువజన విభాగం రాష్ట్ర ఉపాధ్యక్షుడిగా కల్లూరి పవన్‌ను నియమించినట్లు ఆ సంఘం రాష్ట్ర వర్కింగ్ ప్రెసిడెంట్ పులి శ్రీనివాస్ గౌడ్ తెలిపారు. జాతీయ బీసీ సంక్షేమ సంఘం జాతీయ అధ్యక్షుడు ఆర్.కృష్ణయ్య, రాష్ట్ర అధ్యక్షుడు ఎర్ర సత్యనారాయణ ఆదేశాల మేరకు సంఘం కార్యక్రమంలో చురుకుగా పాల్గొంటున్న హనుమకొండ నయింనగర్‌కు చెందిన కల్లూరి పవన్‌ను యువజన విభాగం రాష్ట్ర ఉపాధ్యక్షునిగా నియమించినట్లు ఆయన ఒక ప్రకటనలో వివరించారు.

ముగిసిన పుష్పాభిషేకం

కాజీపేట: 63వ డివిజన్ జూబ్లీ మార్కెట్‌లో కొలువుదీరిన అభయాంజనేయస్వామి దేవాలయంలో ఆది గణపతికి పూలతో అభిషేకం నిర్వహించారు. ఆలయ ప్రధాన అర్చకులు జాగర్లపూడి శ్రీనివాస్ శర్మ ఆధ్వర్యంలో భక్తులు సమర్పించి లక్ష పూలతో గణపతికి సహస్ర నామార్చన చేశారు. ఆలయ అభివృద్ధి కమిటీ సభ్యులు దేవతామూర్తులను దర్శించుకుని మొక్కులు చెల్లించుకున్నారు.

క్యాలెండర్ ఆవిష్కరణ



విద్యారణ్యపురి: తెలంగాణ రెసిడెన్షియల్ డిగ్రీ కళాశాలల సాధికారిత సంఘం రూపొందించిన నూతన సంవత్సరం క్యాలెండర్‌ను హనుమకొండలోని ఆర్‌సీఓ విద్యారాణి మంగళవారం వరంగల్ ప్రాంతీయ కార్యాలయంలో ఆవిష్కరించారు. సాంఘిక సంక్షేమ గురుకులాల్లోని విద్యార్థుల భవిష్యత్ అభివృద్ధికి పాటుపడాలని కోరారు. కార్యక్రమంలో ఆ యూనియన్ అధ్యక్షురాలు డాక్టర్ సాంబలక్ష్మి, బాధ్యులు డాక్టర్ పి.శిరీష, డాక్టర్ టి.మాలతి, బి.సుజాత, పి.జ్యోతి, టి.నాగలక్ష్మి, దీప్తి, గీత తదితరులు పాల్గొన్నారు.

3న టీజేఎస్ సదస్సు

హన్మకొండ చౌరస్తా: ఫిబ్రవరి 3న హనుమకొండలోని అంబేడ్కర్ హాల్‌లో ×విభజన హామీలు- కేంద్ర వివక్ష- దగాపడ్డ ఓరుగల్లు× అంశం పై సదస్సు నిర్వహిస్తున్నట్లు తెలంగాణ జన సమితి రాష్ట్ర ఉపాధ్యక్షుడు శ్రీనివాస్ మంగళవారం ఓ ప్రకటనలో తెలిపారు. ఉదయం 11 గంటలకు నిర్వహించే సదస్సుకు ముఖ్య అతిథిగా ప్రొఫెసర్ కోదండరాం, ఇతర ఉద్యమ నేతలు హాజరవుతారని తెలిపారు.

నర్సింగ్ వృత్తి ఉత్తమమైనది

నయింనగర్: నర్సింగ్ వృత్తి చాలా ఉత్తమమైందని, వారి సేవలు వ్యాధిగ్రస్తులకు, ప్రమాదాలకు గురైన వారికి ఎంతగానో ఉపయోగపడతాయని చైతన్య డీమ్డ్ టు బీ యూనివర్సిటీ కులపతి డాక్టర్ సీహెచ్‌వీ.పురుషోత్తంరెడ్డి అన్నారు. బీఎస్సీ(ఆనర్స్) నర్సింగ్ విద్యార్థులు జనవరి 29 ఫ్లారెన్స్ నైటింగేల్ జన్మదినం సందర్భంగా చైతన్య కళాశాలలో ల్యాంప్ లైటింగ్ వేడుకను నిర్వహించారు. అజారా హాస్పిటల్ డైరెక్టర్ శివసుబ్రమణ్యం సీజీఎం కె.రవిచంద్ర, రిజిస్ట్రార్ రవీందర్ పాల్గొన్నారు.

సీపీఎం ధర్నా

హసన్‌పర్తి: రాష్ట్ర వ్యాప్తంగా ప్రభుత్వ స్థలాల్లో గుడిసెలు వేసుకున్న వారందరికీ ఇళ్ల పట్టాలతో పాటు ఇందిరమ్మ ఇళ్లు మంజూరు చేయాలని కోరుతూ సీపీఎం ఆధ్వర్యంలో మంగళవారం ధర్నా నిర్వహించారు. రాష్ట్రవ్యాప్త కార్యక్రమంలో భాగంగా స్థానిక తహసీల్ కార్యాలయం ఎదుట ధర్నా కార్యక్రమం జరిగింది. అనంతరం డిప్యూటీ తహసీల్దార్ రహీంకు వినతిపత్రం అందించారు.

పోలీసుల తనిఖీలు

ఖిలావరంగల్: సీపీ అంబర్ కిషోర్ ఝూ ఆదేశాల మేరకు మంగళవారం రాత్రి వరంగల్–ఖమ్మం జాతీయ రహదారిపై, జక్కలొద్ది లో వెలిసిన గుడిసెల్లో వరంగల్ టాస్క్‌ఫోర్స్, మామునూరు పోలీస్‌ల ఆధ్వర్యంలో విస్తృత తనిఖీలు నిర్వహించారు. తనిఖీల్లో భాగంగా సీఐ క్రాంతికుమార్, టాస్క్‌ఫోర్స్ సీఐ బాబులాల్ మాట్లాడుతూ గంజాయి నిర్మూలనకు పోలీసుల శాఖ ప్రత్యేక కార్యాచరణ చేపట్టిందన్నారు. అలాగే మిల్స్‌కాలనీ పోలీస్ స్టేషన్ పరిధిలో ఇన్‌స్పెక్టర్ సురేష్ గౌడ్ ఆధ్వర్యంలో రహదారులపై వాహనాలు, కార్ల డిక్కీలను క్షుణ్ణంగా తనిఖీలు చేపట్టారు.

కుష్ఠువ్యాధిని నిర్మూలించాలి

- జిల్లా అడిషనల్ డీఎంహెచ్‌ఓ మదన్ మోహన్‌రావు



హన్మకొండ: పండ్లు పంపిణీ చేస్తున్న కార్పొరేటర్ వెంకటేశ్వర్లు, అడిషనల్ డీఎంహెచ్‌ఓ



ఖిలావరంగల్ : పీహెచ్‌సీలో రోగులకు పండ్లు, దుప్పట్లు పంపిణీ చేస్తున్న వైద్యులు

హన్మకొండ చౌరస్తా: సమాజం నుంచి కుష్ఠువ్యాధిని నిర్మూలించడంతో పాటు వ్యాధిగ్రస్తులను ఆదరించాలని జిల్లా అడిషనల్ డీఎంహెచ్‌ఓ డాక్టర్ మదన్ మోహన్‌రావు అన్నారు. కుష్ఠువ్యాధి నిర్మూలన పక్షోత్సవాలు, జాతీయ కుష్ఠు వ్యాధి నిర్మూలన దినం, మహాత్మ గాంధీ వర్ధంతిని పురస్కరించుకుని మంగళవారం హనుమకొండ 10వ డివిజన్ లోని ఆనంద్ నగర్ కాలనీలో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా డాక్టర్ మదన్‌మోహన్‌రావు మాట్లాడుతూ లెప్రసీ రోగులు సరైన చికిత్స తీసుకోకపోతే వచ్చే అంగవైకల్యాల గురించి వివరించారు. అనంతరం స్థానిక కార్పొరేటర్ తోట వెంకటేశ్వర్లు లెప్రసీ వ్యాధిగ్రస్తులకు పండ్లు, బ్రెడ్లు పంపిణీ చేశారు. కార్యక్రమంలో డిప్యూటీ డీఎంహెచ్‌ఓ డాక్టర్ యాకూబ్‌పాషా, ఏఎన్‌ఎంలు పాల్గొన్నారు.

పీహెచ్‌సీలో జాతీయ లెప్రసీ దినోత్సవం

ఖిలా వరంగల్: కుష్ఠువ్యాధి నిర్మూలకు ప్రతి ఒక్కరూ పాటుపడాలని డాక్టర్ రవీందర్, ఫిజియోథెరపిస్ట్ డాక్టర్ నర్సింహారెడ్డి సూచించారు. డీఎంహెచ్‌ఓ డాక్టర్ వెంకటరమణ ఆదేశాల మేరకు జాతీయ కుష్ఠువ్యాధి నిర్మూలన దినోత్సవం, పక్షోత్సవాల సందర్భంగా మంగళవారం ఖిలావరంగల్ పడమర కోట అర్బన్ ప్రైమరీ హెల్త్‌సెంటర్ (పీహెచ్‌సీ) భవనంలో మెడికల్ ఆఫీసర్ ఎస్.రవీందర్, డీపీఎంఓ అనుపమ ఆధ్వర్యంలో కుష్ఠువ్యాధి నిర్మూలనపై అవగాహన, పక్షోత్సవాల కార్యక్రమం జరిగింది. ముఖ్యఅతిథిగా డాక్టర్ రవీందర్, నర్సింహారెడ్డి హాజరై మహాత్మాగాంధీ చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. అనంతరం రోగులకు పండ్లు, దుప్పట్లు పంపిణీ చేశారు. ఈసందర్భంగా వారు మాట్లాడుతూ ఈనెల 30 నుంచి ఫిబ్రవరి 13 వరకు ఆరోగ్య, ఆశా కార్యకర్తలు బృందాలుగా ఏర్పడి ప్రతి ఇంటికి వెళ్లి కుష్ఠువ్యాధికి సంబంధించిన లక్షణాలపైన పరీక్షలు నిర్వహించడం జరుగుతుందన్నారు. రోగులు భయాన్ని వీడి కుష్ఠువ్యాధి రహిత సమాజాన్ని సాధించడానికి ప్రజలందరూ సహకారం అందించాలని కోరారు. కార్యక్రమంలో సువార్త, సిబ్బంది పాల్గొన్నారు.

మంత్రి సీతక్కను కలిసిన టీఎస్- మేసా



మంత్రి సీతక్కకు పుష్పగుచ్ఛం అందించి అభినందిస్తున్న నేతలు

న్యూశాయంపేట : రాష్ట్ర పంచాయతీరాజ్, స్త్రీ, శిశు సంక్షేమ శాఖ మంత్రి ధనసరి అనసూయ(సీతక్క)తో పాటు, ఇటీవల గవర్నర్ కోటాలో ఎమ్మెల్సీలుగా ఎన్నికైన ప్రొఫెసర్ కోదండరాం, సియాసత్ ఎడిటర్ ఆమీర్ అలీని సోమవారం సాయంత్రం హైదరాబాద్‌లో తెలంగాణ స్టేట్ మైనారిటీ ఎంప్లాయాస్ సర్వీస్ అసోసియేషన్(టీఎస్-మేసా) రాష్ట్ర అధ్యక్షుడు, రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ఫారూఖ్‌అహ్మద్, తోఫికుర్ రహమాన్ నేతృత్వంలో వరంగల్ ఉమ్మడి జిల్లా నాయకులు మర్యాదపూర్వకంగా కలిసి పుష్పగుచ్ఛం అందించి శాలువాలతో సత్కరించి అభినందించారు. మైనారిటీ ఎంప్లాయిస్ సమస్యలపై వినతి పత్రం అందించారు. ఈ సందర్భంగా యూనియన్ నూతన సంవత్సర క్యాలెండర్‌ను మంత్రి సీతక్క ఆవిష్కరించారు. కార్యక్రమంలో నాయకులు ఖాజామున్తహిద్దొద్దీన్, సర్వర్, డాక్టర్ రాజ్‌మహ్మద్, బాబభాయ్ తదితరులు పాల్గొన్నారు.

పౌరహక్కులపై అవగాహన తప్పనిసరి

కాజీపేట అర్బన్ : పౌరులు పౌర హక్కులపై అవగాహన తప్పనిసరిగా కలిగి ఉండాలని తహసీల్దార్ బావుసింగ్ తెలిపారు. 44వ డివిజన్ పరిధిలోని అమ్మవారిపేటలో మంగళవారం ఏర్పాటు చేసిన పౌర హక్కుల దినోత్సవం సందర్భంగా ఏర్పాటు చేసిన సమావేశానికి ముఖ్య అతిథిగా తహసీల్దార్ పాల్గొని మాట్లాడారు. రాజ్యాంగం పౌరులకు కల్పించిన హక్కులను సద్వినియోగం చేసుకోవడం, భంగం కల్పించకుండా చర్యలు తీసుకునేందుకు అవగాహన పెంచుకోవాలని అన్నారు. కార్యక్రమంలో మడికొండ ఎస్సై రాజాబాబు, ఆర్‌ఐ సురేందర్, తదితరులు పాల్గొన్నారు.

శాస్త్రీయ విద్యా విధానంపై ఉద్యమించాలి

ఖిలా వరంగల్ : విద్యార్థులు శాస్త్రీయ విద్యా విధానంపై ఉద్యమించాలని ఏఐఎస్‌ఎఫ్ జిల్లా కార్యదర్శి ల్యాదల్లా శరత్ పిలుపునిచ్చారు. మంగళవారం శివనగర్‌లోని సీపీఐ తమ్మెర భవనంలో జరిగిన సమావేశంలో అఖిల భారత విద్యార్థి సమాఖ్య క్యాలెండర్‌ను ఆయన ఆవిష్కరించి మాట్లాడారు. స్వాతంత్ర పోరాటంలో అగ్రభాగాన నిలిచిన ఏకైక విద్యా సంఘం ఏఐఎస్‌ఎఫ్ అని అన్నారు. మౌటం శివకుమార్, ఖలీల్ సంతోష్‌రాజు, రాకేష్ పాల్గొన్నారు.

బలరాం నాయక్‌కు సంపూర్ణ మద్దతు

హసన్‌పర్తి: మహబూబాబాద్ పార్లమెంట్ కాంగ్రెస్ అభ్యర్థిగా పోరిక బలరాంనాయక్ అభ్యర్థిత్వాన్ని బలపరుస్తున్నట్లు లంబాడి హక్కుల పోరాట సమితి రాష్ట్ర అధ్యక్షుడు పోరిక ఈశ్వర్‌సింగ్ నాయక్ ప్రకటించారు. 56వ డివిజన్ గోపాలపురంలో మంగళవారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. రాష్ట్ర వ్యాప్తంగా ఆదివాసి, గిరి జనులు దాదాపు 50 లక్షల జనాభా కలిగి ఉన్నారని పేర్కొన్నారు. ఆదివాసి, గిరిజనును కాంగ్రెస్ వైపు మొగ్గు చూపుతున్నారని వివరించారు. తెలంగాణ ఏర్పాటులో ముఖ్యభూమిక పోషించిన బలరాంనాయక్ బలత్వాన్ని అన్ని వర్గాలు బలపర్చాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో సీనియర్ నాయవ్యాది భూక్య వెంకట్‌రామ్‌నాయక్,లంబాడీ హక్కుల పోరాట సమితి రాష్ట్ర నాయకులు బానోతు నవీన్ నాయక్, బీసీ కుల గణన సాధన సమితి అధ్యక్షులు బి.సురేష్,విద్యార్థి సంఘం నేతలు నరేందర్, మల్లేష్, ఉదయ్‌సింగ్ పాల్గొన్నారు.

సంక్షిప్త సమాచారం

పోషకాహారంతోనే సంపూర్ణ ఆరోగ్యం

కాజీపేట అర్బన్ : సంపూర్ణ ఆరోగ్యానికి పోషకాహారంతో కూడిన ఆహారాన్ని తీసుకోవాలని డాక్టర్ కిరణ్మయి తెలిపారు. 44వ డివిజన్ పరిధిలోని కొత్తపెల్లిలో మంగళవారం స్ఫూర్తి సేవాసదన్ సహకారంతో ఏర్పాటు చేసిన ఆరోగ్య, పర్యావరణ పరిరక్షణ సదస్సుకు ముఖ్య అతిథిగా ఆమె పాల్గొని మాట్లాడారు. అనంతరం ఏడు రకాల కూరగాయల విత్తనాలను అందజేశారు.

విజయ్ కుమార్‌కు సన్మానం

హన్మకొండ: ఉత్కృష్ట సేవా పతకం గ్రహీత వరంగల్ సైబర్ క్రైమ్ ఏసీపీ కూజ విజయ్‌కుమార్ ముదిరాజ్‌ను ముదిరాజ్ ఎంప్లాయీస్ అండ్ ప్రొఫెషనల్స్ అసోసియేషన్ సన్మానించింది. మంగళవారం రాష్ట్ర ప్రభుత్వంచే ఉత్కృష్ట సేవా పతకం అందుకున్న విజయ్ కుమార్‌ను మెపా రాష్ట్ర కార్యదర్శి పులి దేవేందర్, అసోసియేషన్ నాయకులు శాలువా కప్పి పుష్పగుచ్ఛం ఇచ్చి సన్మానించారు.

హెడ్‌కానిస్టేబుళ్ల ఆత్మీయ సమ్మేళనం

కాజీపేట: 61వ డివిజన్ ఫాతిమానగర్ కాలనీలో మంగళవారం 1992వ సంవత్సరం కానిస్టేబుల్స్ ఆత్మీయ సమ్మేళనం జరుపుకున్నారు. ఉమ్మడి జిల్లాలోని వివిధ పోలీస్ స్టేషన్లలో ప్రస్తుతం హెడ్ కానిస్టేబుళ్లుగా పని చేస్తున్న మిత్ర బృందం సమావేశమై ఆత్మీయతను పంచుకున్నారు.ఆర్థిక ఇబ్బందుల్లో ఉన్న సహచర మిత్రుల కుటుంబాలను ఆదుకోవాలని తీర్మానించుకున్నారు.

గణేష్‌నగర్‌లో ఉచిత వైద్యశిబిరం

దేశాయిపేట : దేశాయిపేటరోడ్ టీచర్స్ కాలనీ గణేష్‌నగర్‌లో శ్రీఆది మహాలక్ష్మి గోదా సమేత శ్రీ వేంకటేశ్వర స్వామి దేవాలయంలో వికాస తరంగిణి, ఆలయం కమిటీలు సంయుక్తంగా స్త్రీల ఉచిత వైద్యశిబిరం మంగళవారం ఏర్పాటు చేశారు. శిబిరంలో ప్రముఖ గైనకాలజిస్ట్ డాక్టర్ బచ్చు వీణ హాజరై 90 మందికి పరీక్షలు చేసి మందులు ఉచితంగా అందజేశారు.

నిట్ నుంచి కుమారస్వామికి డాక్టరేట్

కేయూ క్యాంపస్: కాకతీయ యూనివర్సిటీ ఇంజనీరింగ్ కళాశాలలో పనిచేస్తున్న ఎలక్ట్రికల్ అండ్ ఎలక్ట్రానిక్ ఇంజనీరింగ్ విభాగంలో కాంట్రాక్టు అసిస్టెంట్ ప్రొఫెసర్ కుమారస్వామి జంషడ్‌పూర్‌లోని ఎన్‌ఐటి నుంచి డాక్టరేట్ అవార్డు పొందాడు. జంషడ్‌పూర్‌లోని నిట్‌లో కుమారస్వామి పరిశోధకుడిగా ప్రొఫెసర్ అనన్య భట్టాచార్య పర్యవేక్షణలో తన డిజైన్ అండ్ పర్మార్మెన్స్ ఎవాల్యుయేషన్ ఆఫ్ రెసోనెంట్ కన్వర్టర్స్ ఫర్ ఇండక్షన్ హీటింగ్ అప్లికేషన్స్ అనేఅంశంపై సమర్పించిన పరిశోధనాత్మక సిద్ధాంత గ్రంథానికి ఆయన డాక్టరేట్‌ను ప్రదానం చేశారు.

సాంబశివరావుకు డాక్టరేట్

కాకతీయ విశ్వవిద్యాలయ సోషియాలజీ విభాగ పరిశోధకుడు తమ్మిశెట్టి సాంబశివరావుకు యూనివర్సిటీ డాక్టరేట్‌ను ప్రకటించింది. 'ప్రాబ్లెమ్స్ అండ్ ప్రోస్పెక్టాస్ అఫ్ డిసేబిలిటీ స్టూడెంట్స్ ఇన్ హయ్యర్ ఎడ్యుకేషన్- ఎ స్టడీ ఇన్ ఖమ్మం డిస్ట్రిక్ట్ అఫ్ తెలంగాణా స్టేట్' అనే అంశం పై విభాగసహాచార్యులు డాక్టర్ అయిలయ్య పర్యవేక్షణలో సమర్పించిన పరిశోధనాత్మక సిద్ధాం త గ్రంథానికి సాంబశివరావుకు డాక్టరేట్‌ను ప్ర దానం చేసినట్లు పి.మల్లారెడ్డి తెలిపారు.

బీఆర్‌ఎస్ నుంచి కాంగ్రెస్‌లో చేరిక

కాజీపేట రూరల్ : బాలాజీనగర్‌లో పలువురు బీఆర్‌ఎస్ నుంచి మంగళవారం కాంగ్రెస్ పార్టీలో చేరారు. బీఆర్‌ఎస్ నేతలు మల్లారెడ్డి, చంద్రమౌళి, భూపాల్, రాజేంద్రప్రసాద్, సుధాకర్ కాంగ్రెస్‌లో చేరగా కాంగ్రెస్ నేత విష్ణువర్ధన్‌రెడ్డి పార్టీ కండువా కప్పి ఆహ్వానించారు.

నంబర్‌ప్లేట్ లేకుండా నడిపితే చర్యలు

రామన్నపేట : వరంగల్ పోలీస్ కమిషనర్ అంబర్ కిశోర్ ఝూ, ట్రాఫిక్ ఏసీపీ బోజరాజు ఆదేశాల మేరకు నంబర్‌ప్లేట్ లేకుండా వాహనాలు నడిపే వారి కోసం ప్రత్యేక వాహన తనిఖీలు చేపట్టినట్లు ట్రాఫిక్ ఇన్‌స్పెక్టర్ వెంకన్న తెలిపారు. మంగళవారం నగరంలోని జీడబ్ల్యూజీఎల్ ఎదుట ట్రాఫిక్ ప్రత్యేక వాహనా తనిఖీలు చేపట్టి పెండింగ్ చలాన్స్‌తో పాటు నంబర్‌ప్లేట్ లేని వాహనాలు తనిఖీ చేస్తూ ధృవపత్రాలను పరిశీలించారు.

ఎన్నికల్లో ప్రశ్నించే గొంతుకను బలపరచాలి

కేయూ క్యాంపస్: పట్టభద్రుల ఎమ్మెల్సీ ఎన్నికల్లో ప్రశ్నించే గొంతును బలపరచాలని కాంగ్రెస్ నాయకుడు, ఏఐసిసి మాజీ సభ్యులు, ఉమ్మడి రాష్ట్ర మాజీ చైర్మన్ బక్క జడ్సన్ మంగళవారం యూనివర్సిటీలోని ప్రొఫెసర్లను, అధ్యాపకులను, విద్యార్థులను, టీచింగ్- నాన్ టీచింగ్ పట్టభద్రులను కలిశారు.

కాజీపేట రూరల్ : స్థానిక సేయింట్ గ్యాబ్రియల్ స్కూల్‌లో మంగళవారం స్కూల్ ప్రిన్సిపాల్ ఆంటోని పాలిశెట్టి, ఉపాధ్యాయులను ఏఐసీసీ మాజీ సభ్యుడు, ఉమ్మడి రాష్ట్ర మాజీ చైర్మన్ బక్క జడ్సన్ కలిసి పట్టభద్రుల ఎన్నికల్లో తాను పోటీ చేస్తున్నానని ప్రశ్నించే గొంతుకను బలపర్చాలని కోరారు. అనంతరం కరపత్రాలను ఆవిష్కరించారు.

బీసీ జన గణన నిర్ణయాన్ని స్వాగతిస్తున్నాం

నయింనగర్ : తెలంగాణ సీఎం రేవంత్‌రెడ్డి ఇటీవల ప్రకటించిన తెలంగాణలో బీసీ జనగణన నిర్ణయాన్ని స్వాగతిస్తున్నామని టీటీడీపీ మాజీ ఉమ్మడి వరంగల్ జిల్లా అధ్యక్షుడు, మాజీ కుడా చైర్మన్ గట్టు ప్రసాద్‌బాబు తెలిపారు. మంగళవారం హనుమకొండ ప్రెస్ క్లబ్‌లో ఏర్పాటుచేసిన సమావేశంలో వారు మాట్లాడారు.

పూర్తి ఫీజు ప్రభుత్వమే చెల్లించాలి

హన్మకొండ: రాష్ట్రంలో ఇంజనీరింగ్, ఇతర ప్రొఫెషనల్ కోర్సులు చదువుతున్న బీసీ, ఈబీసీ విద్యార్థులకు ఎలాంటి ఆంక్షలు, నిబంధన లేకుండా పూర్తి ఫీజులను ప్రభుత్వమే చెల్లించాలని బీసీ జేఏసీ రాష్ట్ర చైర్మన్ డాక్టర్ తిరునహరి శేషు కోరారు. మంగళవారం హైదరాబాద్ సెక్రటేరియట్‌లో బీసీ సంక్షేమ శాఖ ప్రిన్సిపల్ సెక్రటరీ బుర్రా వెంకటేశంను కలిసి వినతిపత్రం అందజేశారు. పూలే విదేశీ విద్యాజ్యోతి పథకం కింద ప్రతి సంవత్సరం 2000 మంది బీసీ విద్యార్థులను విదేశాలకు పంపించే విధంగా పథకంలో మార్పులు చేర్పులు చేయాలని కోరారు. పూర్తి ఫీజులు చెల్లించటానికి ప్రభుత్వం సానుకూలంగా ఉందని చెప్పారని తిరునహరి శేషు తెలిపారు.

అతిథి అనాథాశ్రమంలో అయ్యప్ప పడిపూజ

హన్మకొండ కల్చరల్ : హనుమకొండ జిల్లా అఖిల భారత అయ్యప్ప ధర్మప్రచార సభ ఆధ్వర్యంలో అయ్యప్ప జన్మనక్షత్రమైన ఉత్తరానక్షత్రంలో మహాపడిపూజ, అన్నప్రసాదాల వితరణ కార్యక్రమాన్ని నిర్వహించారు. మంగళవారం హనుమకొండ రెడ్డి కాలనీలోని అతిథి అనాథాశ్రమంలో గురుస్వామి శరత్‌శర్మ ఆధ్వర్యంలో పడిపూజ ఘనంగా జరిగింది.

జాతీయ స్థాయి సాఫ్ట్‌బాల్ పోటీలకు శ్రీజ

ఖిలా వరంగల్: ఛత్తీస్‌గఢ్‌లోని ఖాబిర్‌ధంలో ఫిబ్రవరి 3 నుంచి 6 వరకు జరగనున్న జాతీయస్థాయి సాఫ్ట్‌బాల్ పోటీలకుమధ్యకోట ప్రభుత్వ బాలికల ఉన్నంత పాఠశాల విద్యార్థిని శ్రీజ ఎంపికైంది. శ్రీజను హెచ్‌ఎం వెంకటయ్య, వ్యాయామ ఉపాధ్యాయురాలు సృజన అభినందించారు.

డివిజన్ సమస్యలపై నిర్లక్ష్యం తగదు

వరంగల్ చౌరస్తా : వరంగల్‌లోని 28వ డివిజన్‌లో అభివృద్ధి పనులపై, సమస్యలపై నిర్లక్ష్యం తగదని స్థానిక కార్పొరేటర్ గందె కల్పన తెలిపారు. వరంగల్ తూర్పు నియోజకవర్గంలో డివిజన్ వ్యాపార, వాణిజ్య సంస్థలు పెద్ద ఎత్తున ఉన్నాయని, కనీసం సమస్యలను పరిష్కరించకపోవడం బాధాకరమన్నారు.

బీజేపీని విజయతీరాలకు చేర్చాలి

- రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ప్రేమేందర్‌రెడ్డి



సమావేశంలో మాట్లాడుతున్న ప్రేమేందర్‌రెడ్డి

వరంగల్: రానున్న సార్వత్రిక ఎన్నికల్లో బీజేపీని విజయ తీరాలకు చేర్చేందుకు చేపట్టిన గావ్ చలో... బస్తీచలో అభియాన్ కార్యక్రమంలో ఇంటింటా ప్రచారం నిర్వహించాలని రాష్ట్ర పార్టీ ప్రధాన కార్యదర్శి గుజ్జుల ప్రేమేందర్‌రెడ్డి పిలుపునిచ్చారు. మంగళవారం ఆయన తూర్పు నియోజకవర్గం ఎల్‌బీ నగర్‌లోని పార్టీ కార్యాలయంలో డాక్టర్ వన్నాల వెంకటరమణ అధ్యక్షతన జరిగిన సమావేశంలో ఆయన మాట్లాడారు. గావ్ చాలో..బస్తీ చలో అభియాన్‌లో నాయకులు కార్యకర్తలు, బూత్ కమిటీ, వన్నా ప్రముఖ్‌లతో సమావేశమై కొత్త ఓటర్ల నమోదు, వాట్సప్ గ్రూపులు, సరళ్ యాప్ డౌన్‌లోడ్, వికసిత్ భారత్ కార్యక్రమాలపై చర్చించాలన్నారు. ఎస్సీ, ఎస్టీ ప్రాంతాల్లో పర్యటించి పార్టీని బలోపేతం చేయాలన్నారు. సమావేశంలో పార్టీ ఎస్సీ సెల్ రాష్ట్ర అధ్యక్షుడు కొండేటి శ్రీధర్, జిల్లా అధ్యక్షుడు గంటా రవికుమార్, జిల్లా ప్రధాన కార్యదర్శి బాకం హరిశంకర్, రత్నం సతీష్‌షా, ఆర్.శ్రీనివాస్, రంజిత్, సాయిరాంనేత, కుమారస్వామి పాల్గొన్నారు.

మోదీ పాలనకు చరమగీతం పాడాలి



సదస్సులో మాట్లాడుతున్న పెద్దారపు రమేష్

వరంగల్ చౌరస్తా : ప్రధానమంత్రి నరేంద్ర మోదీ పాలనకు చరమగీతం పాడాలని ఎన్నికల లబ్ధి కోసం ఫాసిజాన్ని రెచ్చగొడుతూ మళ్లీ అధికారాన్ని చేపట్టేందుకు ప్రయత్నిస్తున్నారని ఎంసీపీఐ(యూ) జిల్లా కార్యదర్శి పెద్దారపు రమేష్ అన్నారు. మంగళవారం కమ్యూనిస్టు కోఆర్డినేషన్ కమిటీ (సీసీసీ) పిలుపుమేరకు ఎంసీపీఐ(యూ) ఆధ్వర్యంలో 'ముంచుకొస్తున్న మతోన్మాద మనువాద ముప్పు -లౌకిక శక్తుల పాత్ర' అనే అంశంపై వరంగల్ అండర్ బ్రిడ్జికి సమీపంలోని ఓంకార్ భవన్‌లో సదస్సు జరిగింది. రమేష్ మాట్లాడుతూ గాంధీజీని చంపిన గాడ్సేను దేశభక్తుడిగా చిత్రీకరిస్తూ భారత ప్రజాస్వామ్యాన్ని మోదీ ప్రభుత్వం అపహాస్యం పాలు చేస్తున్నారని విమర్శించారు. సమావేశంలో ఏఐఎఫ్‌డీవై రాష్ట్ర ఉపాధ్యక్షులు మంద రవి, ఏఐకేఎఫ్ జిల్లా ప్రధాన కార్యదర్శి కుసుంభ బాబూరావు, కల్లుగీత కార్మిక సంఘం రాష్ట్ర బాధ్యులు నాగెల్లి కొమురయ్య, బీఎల్‌ఎఫ్ వరంగల్ తూర్పు కన్వీనర్ ఐతం నాగేష్, ఏఐసీటీయూ జిల్లా నాయకుడు మల్లి కార్జున్ ,నాయకులు గోవర్ధన్ రాజు, ప్రేమలత, అనూష, రేణుక తదితరులు పాల్గొన్నారు.

గాంధీజీ ఆశయాలు అనుసరణీయం

శాంతి, అహింస ద్వారా దేశానికి మహాత్మా గాంధీ స్వాతంత్ర్యం తీసుకొచ్చారని, గాంధీజీ ఆశయాలు అనుసరణీయమని పలువురు వక్తలు అన్నారు. మంగళవారం జాతిపిత మహాత్మా గాంధీ వర్ధంతిని జరుపుకున్నారు. ఈ సందర్భంగా గాంధీ చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. అనంతరం పిల్లలకు నోట్ పుస్తకాలను పంపిణీ చేశారు. కార్యక్రమాల్లో ఆయా పార్టీల నాయకులు, ప్రజాప్రతినిధులు, స్వచ్ఛంద సంస్థల ప్రతినిధులు, ఉపాధ్యాయులు, తదితరులు పాల్గొన్నారు. – సాక్షి, నెట్‌వర్క్



హన్మకొండ : గాంధీ చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పిస్తున్న బీఆర్‌ఎస్ నేతలు



హసన్‌పర్తి: జాతిపిత విగ్రహానికి పూలమాల వేసి నివాళులర్పిస్తున్న వాసవిక్లబ్‌సభ్యులు



కాజీపేటలో...



వరంగల్ చౌరస్తా: వరంగల్ స్టేషన్ రోడ్డులో..



కాజీపేట రూరల్ : బాలాజీనగర్‌లో..



హన్మకొండ అర్బన్ : గాంధీ చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పిస్తున్న ప్రిన్సిపాల్



హన్మకొండ చౌరస్తా: పబ్లిక్‌గార్డెన్‌లో గాంధీ విగ్రహం వద్ద నివాళులర్పిస్తున్న కాంగ్రెస్ శ్రేణులు

అమరులకు ఘన నివాళి



కాజీపేట రూరల్ : త్యాగమూర్తుల చిత్రపటాల వద్ద మౌనం పాటిస్తున్న ఇనిస్టిట్యూట్ సభ్యులు

హన్మకొండ: దేశానికి స్వాతంత్ర్యం తీసుకురావడానికి పోరాటం చేసి అసువులు బాసిన అమరులకు విద్యుత్ అధికారులు, ఉద్యోగులు నివాళులర్పించారు. అమరవీరుల దినోత్సవాన్ని పురస్కరించుకుని మంగళవారం హనుమకొండలోని టీఎస్ ఎన్పీడీసీఎల్ ప్రధాన కార్యాలయంలో చైర్మన్, ఎండీ కర్నాటి వరుణ్‌రెడ్డి, సీజీఎలు, జీఎంలు. అధికారులు, ఉద్యోగులు తమ పనిప్రదేశాల్లో రెండు నిమిషాలు మౌనం పాటించి అమరులకు నివాళులర్పించారు. ఈ సందర్భంగా సీఎండీ వరుణ్ రెడ్డి మాట్లాడుతూ దేశానికి స్వాతంత్ర్యం తీసుకురావడానికి సమరయోధులు చేసిన త్యాగాలను గుర్తు చేశారు.

కాజీపేట రూరల్ : కాజీపేట రైల్వే జనరల్ ఇనిస్టిట్యూట్‌లో మంగళవారం సికింద్రాబాద్ డివిజన్ రైల్వే సీనియర్ డీపీఓ ఎ.అభిలాష్ ఆదేశాల మేరకు స్వాతంత్ర్యం కోసం అమరులైన పోరాట యోధులు, త్యాగమూర్తుల ఆత్మశాంతి కోసం మౌనం పాటించారు. త్యాగమూర్తుల చిత్రపటాలకు పూలమాల వేసి మౌనం పాటించారు. రైల్వే ఇనిస్టిట్యూట్ సెక్రటరీ దేవులపల్లి రాఘవేందర్ మాట్లాడుతూ స్వాతంత్ర్యం కోసం వీరమరణం పొందిన త్యాగమూర్తులు ఎంతో మంది ఉన్నారన్నారు. కార్యక్రమంలో ఇనిస్టిట్యూట్ కార్యవర్గ సభ్యులు ఎం.రాజయ్య, పి.ప్రశాంత్, లక్ష్మీనారాయణ, అయోధ్య, జిలాని, ఎం.డి.చాంద్‌పాషా, సుదర్శన్, రాజేంద్రప్రసాద్, ఎం.రవికుమార్, రఘుపతి పాల్గొన్నారు.

పట్టభద్రులు ఓటరుగా నమోదు చేసుకోవాలి



పట్టభద్రుల ఓటరు నమోదు దరఖాస్తులతో వాసుదేవరెడ్డి

కేయూ క్యాంపస్: వరంగల్-ఖమ్మం-నల్గొండ గ్రాడ్యుయేట్ ఎమ్మెల్సీ ఎన్నికల ఓటరు నమోదు చేసుకోవాలని తెలంగాణ దివ్యాంగుల సహకార సంస్థ మాజీ చైర్మన్ (టీవీసీసీ) కేతిరెడ్డి వాసుదేవరెడ్డి కోరారు. మంగళవారం కాకతీయ యూనివర్సిటీలో బీఆర్‌ఎస్‌వీ ఆధ్వర్యంలో ఆ విభాగం కేయూ అధ్యక్షుడు బైరపాక ప్రశాంత్ అధ్యక్షతన పట్టభద్రుల ఓటరు నమోదు కార్యక్రమం చేపట్టారు. క్యాంపస్‌లోని గ్రంథాలయం వద్ద పట్టభద్రులకు నమోదు చేసుకోవాలని ప్రచారం నిర్వహించారు. కార్యక్రమానికి ముఖ్య అతిథిగా వాసుదేవరెడ్డి ముఖ్య అతిథిగా హాజరై అర్హులైన గ్రాడ్యుయేట్ ఓటర్ల నుండి దరఖాస్తులు అందించి, పలువురు నుండి దరఖాస్తులను స్వీకరించారు. గత ఎన్నికల సమయంలో 5లక్షల మంది గ్రాడ్యుయేట్లు ఓటరుగా నమోదు చేసుకున్నారన్నారు. కార్యక్రమంలో హుజూర్‌నగర్ జెడ్పీటీసీ సభ్యులు డాక్టర్ కొప్పుల సైదిరెడ్డి, మాజీ కార్పొరేటర్ జోరిక రమేష్, హసన్‌పర్తి మండల బీఆర్‌ఎస్ అధ్యక్షుడు రజినీకుమార్, సీనియర్ నాయకులు డాక్టర్ వీరేందర్, కొమురయ్య, 17వ డివిజన్ అధ్యక్షుడు దామోదర్, కృష్ణ, విజిలెన్స్ కమిటీ సభ్యుడు రామ్మూర్తి, పాల్గొన్నారు.

భద్రకాళి హుండీ ఆదాయం రూ.68.11 లక్షలు



దేవాలయంలో హుండీ లెక్కిస్తున్న సిబ్బంది

హన్మకొండ కల్చరల్ : శ్రీభద్రకాళి దేవాలయంలో మంగళవారం హుండీ లెక్కింపు జరపగా రూ.68,11,510 ఆదాయం లభించిందని, నగదును కెనరా బ్యాంకులో జమ చేయడం జరిగిందని ఆలయ ఈఓ శేషుభారతి తెలిపారు. విదేశీ కరెన్సీ 285 యుఎస్‌ఏ డాలర్లు, 110 కెనడా డాలర్లు, 20 ఆస్ట్రేలియా డాలర్లు, 5 సింగపూర్ డాలర్స్, 2 మలేషియా రింగిట్ లభించాయని తెలిపారు. లెక్కింపులో పర్యవేక్షణాధికారిగా దేవాదాయశాఖ పరిశీలకులు సంజీవరెడ్డి వ్యవహరించారు. ప్రధానార్చకులు భద్రకాళి శేషు, ఆలయసిబ్బంది పాల్గొన్నారు.

కానిస్టేబుల్ దంపతులపై కేసు నమోదు

వరంగల్ క్రైం: ధర్మసాగర్ పోలీస్ స్టేషన్‌లో కానిస్టేబుల్‌గా పనిచేస్తున్న తుమల సాయిబాబు, సులోచన దంపతులపై హనుమకొండ పోలీస్‌స్టేషన్‌లో కేసు నమోదు చేసినట్లు హనుమకొండ ఇన్‌స్పెక్టర్ కరుణాకర్ తెలిపారు. రెడ్డికాలనీకి చెందిన తుమల సాయిబాబు, సులోచన ఇంటినిర్మాణం కోసం 2018లో గ్రేటర్ మున్సిపాల్ కార్పొరేషన్ నుంచి అనుమతి తీసుకున్నారు. నకిలీ పత్రాలు సమర్పించి అనుమతి తీసుకోవడంపై అదే కాలనీకి చెందిన రవీందర్ కార్పొరేషన్‌లో ఫిర్యాదు చేయడంతో విచారణ చేసి సిటిప్లానర్ ఖలీలుద్దీన్ మంగళవారం ఫిర్యాదు చేయడంతో కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు సీఐ తెలిపారు.

ఉపాధ్యాయుడికి సన్మానం

కరీమాబాద్: స్థానిక ప్రభుత్వ ప్రాథమిక పాఠశాలలో పనిచేసి బదిలీపై వెళ్లిన శ్రీకాంత్‌ను మంగళవారం పాఠశాలలో ఘనంగా సన్మానించారు. సమావేశానికి ఇన్‌చార్జ్ హెచ్‌ఎం రేఖ అధ్యక్షత వహించగా 40వ డివిజన్ కార్పొరేటర్ రవి హాజరై మాట్లాడారు.